క్లుప్తంగా

యువకులకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ

వేంపల్లె : పట్టణంలోని బీఎస్ఆర్ టెక్నికల్ డ్రైవింగ్ స్కూలులో ఉన్న నిరుద్యోగ యువకులకు స్థానిక శ్రీచైతన్య మహిళా మండలి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షురాలు రామాంజనమ్మ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ హైదరాబాద్ అభయ ఫౌండేషన్ సహాయ సహకారంతో 20 రోజులు శిక్షణ, 10 రోజులు తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం ఎల్ఎల్ఆర్ లైసెన్స్, సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. 19 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు మధ్య వయస్సు ఉండి టెన్త్, ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ అయిన యువకులు నాలుగు పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డులతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 8886767141, 9703098181 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

తైక్వాండో పోటీల్లో రాణించిన చిన్నారులు



విజేతలతో కోచ్ సుమన్

కమలాపురం : చిన్నారులు తైక్వాండో పోటీల్లో రాణించినట్లు కోచ్ సుమన్ తెలిపారు. ఈనెల 11, 12వ తేదీల్లో తిరుపతిలో టెంపుల్ తైక్వాండో భారత్ సౌత్‌మీట్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కమలాపురంకు చెందిన ఆరు మంది చిన్నారులు ప్రతిభ కనబరిచి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారని ఆయన తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ఆశీర్వాదం, ఎస్ఎండీ షాహీర్, షేక్ అహిల్ గోల్డ్ మెడల్ సాధించగా, షేక్ అయాన్, నాగరాజు సిల్వర్ మెడల్, నవీన్ బ్రాంజ్ మెడల్ సాధించారని ఆయన వివరించారు.

పుల్వామా వీర జవాన్లకు ఘన నివాళి

వేంపల్లె : జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామాలోని సైనిక వాహనాల క్యాన్వాయ్‌పై ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిలో వీర మరణం పొందిన భారత జవాన్లకు ఘన నివాళిని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ రహమతులా, కో కన్వీనర్ దాదాపీర్‌లు అర్పించారు. మంగళవారం వేంపల్లెలో వారు వీర జవాన్లకు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించి మాట్లాడారు. జమ్మూ – శ్రీనగర్ జాతీయ రహదారిపై పుల్వామా జిల్లా లేథిపురలో 2019 ఫిబ్రవరి 14న సైనికులంతా జమ్మూ నుంచి శ్రీనగర్‌కు వెళుతుండగా సాయంత్రం 4గంటలకు ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడ్డారని.. దాదాపు 40 మంది సీఆర్పీఎఫ్‌కు చెందిన సైనికులు వీర మరణం పొందారన్నారు. అనంతరం వీర సైనికులకు ఘన నివాళులర్పించారు.

రేపు కోట గంగమ్మ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో కోటగంగమ్మ అమ్మవారు

కమలాపురం : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వెలసిన శ్రీ కోటగంగమ్మ ఆలయం 16 వ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేద పండితులు కోటగంగమ్మకు పాలాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తామని వారు తెలిపారు. అలాగే అన్నదానం ఏర్పాటు చేస్తామని, భక్తులు విరివిగా పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని ఆర్టీపీపీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీపీపీలో ఆర్టీపీపీ జేఏసీ నాయకులు సమావేశమై అనంతరం మాట్లాడారు. విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని చెప్పిన హామీని రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఆర్టీపీపీ జేఏసీ స్టేట్ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ రాము, ఆర్టీపీపీ కన్వీనర్ శ్రీనివాసులు, రీజినల్ వైస్ ప్రెసిడెంట్ ప్రకాశ్‌రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.



సమావేశ అనంతరం మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

టైలింగ్ పాండ్‌లో ఎండిన
యురేనియం వ్యర్థ పదార్థం

- గాలికి కె.కె.కొట్టాల గ్రామంపై పడుతున్న వ్యర్థ పదార్థ ధూళి
- ఆందోళనలో కె.కె.కొట్టాల గ్రామస్తులు



కె.కె.కొట్టాల గ్రామంలోకి గాలి ద్వారా వెళుతున్న టైలింగ్ పాండ్‌లోని యురేనియం వ్యర్థ పదార్థం ధూళి

వేముల : మండలంలోని కె.కె.కొట్టాల గ్రామ సమీపంలోని యురేనియం టైలింగ్ పాండ్‌లో యురేనియం వ్యర్థ పదార్థం ఎండిపోతోంది. దీంతో గాలి వీచినప్పుడల్లా వ్యర్థ పదార్థ ధూళి గ్రామంపైకి వస్తుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. తుమ్మలపల్లె యురేనియం కర్మాగారంలో యురేనియం ముడి పదార్థాన్ని శుద్ధి చేస్తున్నారు. శుద్ధి చేయగా వ్యర్థ పదార్థమంతా పైపులైన్ ద్వారా కె.కె.కొట్టాల గ్రామ సమీపంలోని టైలింగ్ పాండ్‌లోకి వెళుతుంది. టైలింగ్ పాండ్‌లోకి కొన్నిరోజులుగా ఒక చోట మాత్రమే యురేనియం ప్రాజెక్టు నుంచి వ్యర్థ పదార్థం పైపులైన్ ద్వారా వచ్చి చేరుతోంది. మిగతా ప్రాంతంలో కొన్ని రోజులుగా వ్యర్థ పదార్థం టైలింగ్ పాండ్‌లోకి చేరకపోవడంతో టైలింగ్ పాండ్‌లోని వ్యర్థ పదార్థం ఎండుతోంది. దీంతో యురేనియం వ్యర్థ పదార్థం పొడిగా మారి దుమ్ము, ధూళి రూపంలో గాలి ద్వారా గ్రామంపైకి వస్తోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మామూలుగా యురేనియం వ్యర్థ పదార్థమంతా ఎప్పుడు తడిగా ఉండి గాలికి దూళి రూపంలో బయటకు వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. అయితే ఇక్కడ యురేనియం అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. టైలింగ్ పాండ్‌లోని వ్యర్థ పదార్థం గాలిలోకి వెళితే గ్రామస్తులు రోగాల బారినపడే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా యురేనియం అధికారులు యురేనియం వ్యర్థ పదార్థం గాలిలో కలవకుండా తడిగా ఉండేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తపాలా అధికారులకు కృతజ్ఞతలు

కమలాపురం : తపాలా శాఖ అందిస్తున్న సేవలకు సంబంధించిన సమస్యలపై స్పందించిన తపాలా శాఖ ఉన్నతాధికారులకు న్యాయవాది పాల్ సుధాకర్ కృతజ్ఞతలు తెలియజేశారు. రెండు వారాలుగా కమలాపురంలోని తపాలా కార్యాలయంలో సర్వర్ పని చేయకపోవడంతో రిజిష్టర్ పోస్ట్, స్పీడ్ పోస్ట్ సేవలు నిలిపివేయ బడ్డాయి. దీంతో న్యాయవాది సుధాకర్ ఈనెల 7వ తేదీన తపాలా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఉన్నతాధికారులు ఈనెల 14న కొత్త సర్వీస్ సిస్టమ్ కమలాపురం పోస్ట్ ఆఫీస్‌కు పంపిస్తామని, 15వ తేదీ నుంచి అన్ని రకాల సేవలు అందుతాయని వారు తిరుగు లేఖ ఫిర్యాదుదారునికి రాశారు. దీంతో న్యాయవాది తపాలా అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలి

వీరపునాయునిపల్లె : బుడ్డ శనగ, మినుము పంటలు సాగు చేసిన రైతులు రైతు భరోసా క్రేంద్రాల్లో పేర్లను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ప్రారంభమైన నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతులు పండించిన బుడ్డ శనగ, మినుము పంటలకు సంబంధించిన దిగుబడులను డీసీఎంఎస్ ద్వారా నాణ్యత ప్రమాణాలు కలిగిన బుడ్డ శనగ, మినుము పంటలను కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. దిగుబడులను అమ్ముకొనేందుకు రైతులు తమ ఆదార్ కార్డు, మొబైల్ నెంబరు తీసుకుని రైతు భరోసా కేంద్రానికి వెళ్లి బయోమెట్రిక్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. బుడ్డ శనగ క్వింటా రూ.5,335, మినుములు రూ.6,600లతో కొనుగోలు చేయడం జరుగుతోందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



రైతు భరోసా కేంద్రంలో నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న శ్యామ్‌బాబు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలన

లింగాల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను మంగళవారం పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు పరిశీలించి మాట్లాడారు. వచ్చేనెల 16వ తేదీన పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయని.. మండలంలో 833 మంది పట్టభద్రులు, 32 మంది ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి, ఆర్ఐ సురేంద్రనాథ్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి రెండు వేర్వేరు పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆర్డీఓ వెంకటేశులు పరిశీలించి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్ సౌకర్యం, కుర్చీలు, తాగునీటి వసతులు ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ షేక్షావలి, ఎన్నికల ఆపరేటర్ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



సింహాద్రిపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకటేశులు, తదితరులు

వ్యాయామం చేస్తే ఒత్తిడిని జయించవచ్చు

కొండాపురం : విద్యార్థులు విద్యతో పాటు వ్యాయామం చేస్తే మానసిక ఒత్తిడిని జయించవచ్చని కొండాపురం వైద్యురాలు వి.సూజాత తెలిపారు. మంగళవారం మండలంలోని లావనూరు, కొండాపురం జెడ్పీ ఉన్నతపాఠశాల అలాగే తిమ్మాపురం పాఠశాలల్లో ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ప్రధాన మంత్రి పిలుపు మేరకు హెల్త్ మేళాపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సైకిల్ తొక్కుదాం–ఆరోగ్యంగా ఉందాం, శారీరక శ్రమ ఆరోగ్యానికి ధీమా, యోగా చేద్దాం ప్రశాంతంగా ఉందాం అంటూ పుర వీదుల వెంబడి విద్యార్థులు సైకిల్ తొక్కుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అనిల్ కుమార్‌రెడ్డి ఎంపీహెచ్ఈఓలు బాలనరసింహులు, ధనలక్ష్మి, పిహెచ్ఎన్ కళావతి, 104 డీఈఓ రాజ్‌కుమార్, రాజేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫేస్ యాప్ రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని వీఆర్ఎలకు ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని వీఆర్ఎల సంఘం యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు బి.మనోహర్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్ఎలకు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. వీరికి కనీస వేతనం చెల్లించాలన్నారు. గ్రామాల్లో చాలా మంది వీఆర్ఎలు చదువు రాని వారు ఉన్నారని వీరికి పేస్ యాప్‌ను పెట్టడం ద్వారా తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. అర్హులైన వీఆర్ఎలకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. అనంతరం డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, సుంకర రవి, వీఆర్ఎల సంఘం నాయకులు నాగేంద్ర, నాగేష్, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో క్రీడాకారుల ప్రతిభ

పులివెందుల టౌన్ : ఈనెల 12వ తేదీన తూర్పు గోదావరి జిల్లా కాకినాడ పట్టణంలోని డీఎస్ఏ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో పులివెందులకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపి రెండు రజత పతకాలు సాధించారని మాస్టర్ దినేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 38వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో పులివెందులకు చెందిన గంగా నందిని సీనియర్ కేటగిరీ బాలికల విభాగంలో అండర్ 49 కేజీలలో ప్రతిభ చూపి రజత పతకం.. అలాగే పులివెందులకు చెందిన మంజు సీనియర్ కేటగిరీ బాలికల విభాగంలో అండర్–46 కేజీలలో ప్రతిభ చూపి రజత పతకం సాధించారన్నారు. వీరి ప్రతిభపట్ల మాస్టర్ దినేష్‌తోపాటు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



రజత పతకాలు సాధించిన క్రీడాకారులతో మాస్టర్ దినేష్, తదితరులు

సామాజిక బాధ్యతను చాటిన యూసీఐఎల్

రూ. 35 లక్షల సీఎస్ఆర్ ఫండ్ చెక్కును కలెక్టర్‌కు అందజేసిన యూసీఐఎల్ ప్రతినిధులు

కడప సిటీ : వేముల మండలంలోని యురేనియం కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్(యూసీఐఎల్) సంస్థ జిల్లా అభివృద్ధి కోసం రూ. 35 లక్షల ఆర్థికసాయం అందించి తమవంతు సామాజిక బాధ్యతను చాటుకుంది. మంగళవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లోని కలెక్టర్ విజయరామరాజును కలిసిన యూసీఐఎల్ సంస్థ ప్రతినిధులు ఈచెక్కును ఆయనకు అందజేశారు.కలెక్టర్‌ను కలిసి వారిలో యూసీఐఎల్ ప్రతినిధులు జీఎం ఎంఎస్ రావు, డిప్యూటీ జీఎం సంజయ్ చటర్జీ, సీఎస్ఆర్ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి, కో ఆర్డినేటర్ గంగిరెడ్డి తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న యూసీఐఎల్ ప్రతినిధులు

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



పులివెందులలో సీఎం పర్యటన ఏర్పాట్లపై బలరామిరెడ్డితో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్

పులివెందుల : పులివెందులలోని ఎస్‌సీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో బుధవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బలరామిరెడ్డి కుమారుడు రామతేజేశ్వర రెడ్డి, అశ్వినిరెడ్డిల వివాహ రిసెప్షన్ జరగనుంది. ఈ వేడుకకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానుండటంతో జిల్లా కలెక్టర్ విజయరామరాజు మంగళవారం ఫంక్షన్ హాలులో ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ తుషార్ డూడీ, ఆర్డీఓ వెంకటేశులు, పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు రాజు, వెంకటేశ్వర్లు, ఎస్ఐలు చిరంజీవి, హుస్సేన్, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, కమిషనర్ నరసింహారెడ్డిలతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

వైవీయూ: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో లభిస్తున్న కోర్సులు, సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల అధ్యాపకులు కోరారు. మంగళవారం కడప ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు పెండ్లిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో లభించే కోర్సులు, సదుపాయాలపై ప్రచారబాట నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు నాగరాజు, రాజీవ్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉండే కోర్సులతో పాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ సేవలు అదనంగా ఉన్నాయన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కవిత తెలిపారు. మంగళవారం నగరంలోని పాత రిమ్స్‌లోగల ఆదరణ నిరాశ్రయుల వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథలు, అభాగ్యులు, భిక్షాటన చేసే మహిళలు, పురుషుల కోసం, రోడ్డు పక్కన, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, బహిరంగ ప్రదేశాల్లో నివసిస్తున్న మహిళలు, పురుషుల కోసం వివిధ ప్రాంతాల నుంచి వైద్య సేవలకు పట్టణానికి వచ్చే నిరుపేదల కోసం ఉచిత నిరాశ్రయుల వసతి గృహాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలనిసూచిస్తూ సీనియర్ సిటిజన్ టోల్‌ఫ్రీ నెంబరు 14567పై అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

దామోదరం సంజీవయ్యకు నివాళి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గొప్ప దార్శనికుడని డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య బడుగు, బలహీన వర్గాల ఉన్నతి కోసం ఎంతో కృషి చేశారన్నారు. బండి జకరయ్య, సత్తార్ పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు ఉత్పత్తిని పెంచాలి



పాత కంపోస్టుయార్డులో వర్మీ కంపోస్టు యూనిట్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: ఉక్కాయపల్లె వద్దనున్న పాత కంపోస్టు యార్డులో వర్మీ కంపోస్టు ఉత్పత్తిని మరింత మెరుగు పరచాలని కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం ఆయన కంపోస్టు యార్డును తనిఖీ చేసి నీటి సౌకర్యం కల్పించాలని, ఎంఆర్ఎఫ్ షెడ్, వేయింగ్ మెషీన్ మరమ్మతులను తక్షణమే చేయించాలని ఆదేశించారు. క్లాప్ వాహనాల్లో కెమెరాలకు మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. గాంధీ పార్కులో చిన్నారులకు ఆట పరికాలు, ఇసుకను ఏర్పాటు చేయాలని సూచించారు.అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ రవీంద్రనాథ్ రెడ్డి, డీఈ అబిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

గాంధీనగర్ ఉన్నత పాఠశాల తనిఖీ...

కడప నగరంలోని గాంధీనగర్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ తనిఖీ చేశారు. మంగళవారం ఆయన స్కూల్‌ను తనిఖీ చేసి పదవ తరగతి విద్యార్థులకు సోషల్ పాఠాలు బోధించారు. పాఠాలను సులువుగా గుర్తుంచుకునే విధానాన్ని వివరించారు. పాఠశాలలో మ్యూజిక్ రూం ఏర్పాటు చేయాలని, పిల్లలు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో ఆసక్తి కలిగేలా చూసుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థుల కోసం ప్రేరణ పుస్తకాలను పంపిణీ చేశామని, విద్యార్థులు వాటిని ఐదుసార్లు కంఠస్థం చేస్తే పదవ తరగతిలో మంచి ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

సైక్లింగ్‌తో క్యాన్సర్‌ను జయించవచ్చు



పులివెందులలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు



తొండూరులో విద్యార్థులతో కలిసి సైకిల్ తొక్కుతున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది



ఎర్రగుంట్లలో ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ పి.జగన్నాథ్

పులివెందుల రూరల్ : ప్రతిరోజు క్రమం తప్పకుండా సైక్లింగ్, వ్యాయామం చేయడంవల్ల క్యాన్సర్‌ను జయించవచ్చునని నల్లపురెడ్డిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలోని స్థానిక ఏరియా ఆసుపత్రి నుంచి సిబ్బందితో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించి క్యాన్సర్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకిల్ తొక్కడంవల్ల, వ్యాయామం చేయడంవల్ల శారీరక బరువును తగ్గించుకోవచ్చునని, తద్వారా అధికంగా ఉన్న క్యాలరీలను ఖర్చు చేయవచ్చునన్నారు. రక్తపోటు నియంత్రణలో ఉంటుందని.. భవిష్యత్‌లో గుండెకు సంబంధించిన సమస్యలను నివారించుకోవచ్చునన్నారు. వ్యాయాయం చేయడంవల్ల గంట గంటకు 450 నుంచి 750 కేలరీలను ఖర్చు చేసుకోవచ్చునన్నారు. ప్రతి ఒక్కరు సైకిల్ తొక్కాలని, వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తొండూరు : ప్రతిరోజు సైక్లింగ్ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పీహెచ్‌సీ డాక్టర్ అరిఫుల్లా తెలిపారు. మంగళవారం తొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మేళా కార్యక్రమంలో డాక్టర్ అరిఫుల్లా సైకిల్ ద్వారా ఆరోగ్యం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సైకిల్ తొక్కడం ద్వారా కలిగే ప్రయోజనాలు, గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహం, అధిక బరువు లాంటి సమస్యలకు చక్కని పరిష్కారమన్నారు. పిల్లలు, పెద్దలు సైకిల్ వాడటం ఉత్తమమన్నారు. అలాగే బూచుపల్లె, మల్లేల, సైదాపురం, ఇనగలూరు గ్రామాల్లో మాత శిశు ఆరోగ్య సేవలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం పిల్లలతో కలిసి వైద్య సిబ్బంది సైకిల్ తొక్కారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మా, కమ్యూనిటీ ఆరోగ్య అధికారిణి రమణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్స్ మల్లయ్య, శశికళ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ వారోత్సవాల ర్యాలీ

ఎర్రగుంట్ల : పట్టణంలోని ప్రభుత్వ ఆరోగ్య వైద్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మేళా వారోత్సవాల సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎర్రగుంట్ల మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ ప్రారంభించారు. ఈ ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా వైద్యాధికారులు నాగర్జున, జ్యోత్స్నలు మాట్లాడుతూ పీహెచ్‌సీలో రోగులకు కావాల్సిన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చిలంకూరులో..

మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మేళా వారోత్సవాలను నిర్వహించారు. వైద్యాధికారులు సురేష్మా, సుచరితలు మాట్లాడుతూ వైద్య సదుపాయాలను గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.